

కొంచెం చేదు.. కొంచెం తీపి..

బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలో కొన్నింటికే నిధులు

- కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి హామీ
- లెదర్ పార్క్‌ల ఏర్పాటుతో జనగామ జిల్లాకు లబ్ధి
- రూ.2లక్షల రుణమాఫీతో రైతుల్లో ఆనందం
- రైతు బంధు రూ.15వేలకు పెంపుతో ఊరట
- ఐటీ పరిశ్రమలకు ఊతంతో ఐటీ పార్క్‌కు మహర్దశ

హనుమకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు పెద్దగా నిధుల కేటాయింపులు జరగలేదు. ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశించిన మేరకు నిధుల వరదలేవీ పారలేదు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం అసెంబ్లీలో 2024-25 సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మిశ్రమ స్పందన లభిస్తోంది. వరంగల్ గీసుగొండలో నిర్మాణంలో ఉన్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీ కాస్త ఊరటనిచ్చింది. రాష్ట్రంలో రెండు లెదర్ పార్క్‌లను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ఇందులో ఒకటి జనగామ జిల్లాలో ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఐటీ పరిశ్రమలను ద్వితీయ, తృతీయ నగరాలకు విస్తరించనున్నట్టు పేర్కొన్న దృష్ట్యా ఉమ్మడి వరంగల్ జిల్లాకు కొంత మేలు జరగవచ్చు. రూ.2 లక్షల రుణమాఫీ చేయనున్నట్టు చేసిన ప్రకటనతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించినట్టు రైతు బంధును రూ.15వేలకు పెంచనున్న ప్రకటనతో కూడా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రూ.500కు గ్యాస్, 200 యూనిట్ల ఉచిత కరెంట్‌తో సహా ఆరు గ్యారెంటీల అమలుకు అనుకున్నట్టుగానే బడ్జెట్‌లో భారీగా నిధుల ప్రతిపాదన చేశారు. నీటిపారుదల రంగానికి పెద్దపీట వేసినా కాళేశ్వరం, దేవాదుల, ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టులకు ఆశించిన మేరకు నిధుల ప్రస్తావన లేదు. మొత్తం మీద బడ్జెట్ పట్ల ప్రజల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది.

మెగా టెక్స్‌టైల్

వరంగల్ గీసుగొండలో నిర్మాణంలో ఉన్న కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్క్ మరింతగా అభివృద్ధి చేస్తామని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్ర నిధులతో పాటు పీఎం మిత్ర నిధులను ఇందు కోసం పూర్తిస్థాయిలో వినియోగిస్తామన్నారు. దీంతో వరంగల్ జిల్లా ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోంది. రానున్న రోజుల్లో పెద్ద మొత్తంలో నిధులు మంజూరై పార్క్ పనులు త్వరితగతిన పూర్తికాగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ఆట్టహాసంగా మెగాటెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటుచేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. పార్క్‌లో యూనిట్ల స్థాపనకు అవసరమైన ప్రాతిపదిక సౌకర్యాల కల్పనకు నిధులను ఇవ్వలేదు. గత సంవత్సరం బడ్జెట్‌లో కేటాయించిన రూ.160కోట్లు ఏమూలకు సరిపోలేదు.

రెండు లెదర్ పార్క్‌లు

మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌లో లెదర్ పార్క్‌ల ఏర్పాటును ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో త్వరలో రెండు లెదర్ పార్క్‌లను ఏర్పాటు చేయబోతున్నట్టు పేర్కొన్నారు. ఇందులో ఒకటి జనగామ జిల్లాలో ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఈ జిల్లాలో మెగా లెదర్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్టు గత ఐటీ పరిశ్రమల మంత్రి కేటీఆర్ 2016లో అసెంబ్లీలో స్వయంగా ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తోలు ఉత్పత్తులకు మంచి అవకాశం ఉంది. ముఖ్యంగా జనగామ జిల్లాలో చర్మకారులు అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ దృష్ట్యా ఇక్కడ లెదర్ పార్క్ ఏర్పాటుకు గతంలోనే సన్నాహాలు జరిగాయి. ఇప్పుడు పూర్తిస్థాయిలో సాకారం అయ్యే అవకాశం ఉంది. బడ్జెట్‌లో పరిశ్రమల శాఖకు రూ.2,543 కోట్లను ప్రతిపాదించారు.

వీటి ఊసే లేదు..

తమ ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న సూపర్ స్పెషాలిటీ ఇతర ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీల నిర్మాణానికి కావలసిన నిధులను మంజూరు చేస్తుందని ఆర్థిక మంత్రి ప్రకటించారు. వరంగల్ పాత సెంట్రల్ జైలు స్థలంలో రూ.11వేల కోట్లతో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనుల సత్వర పూర్తికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధుల ప్రస్తావన లేదు. సెంట్రల్ జైలు పునర్నిర్మాణ ప్రతిపాదన కూడా చేయలేదు. మామునూరు విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయనునట్టు సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించినా ఆమేరకు నిధుల కేటాయింపు జరగలేదు. మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఊసేలేదు. కాళోజీ కళాక్షేత్రం, ఔటర్ రింగ్ రోడ్డు, కాకతీయ విశ్వవిద్యాలయం తదితర వాటికి నిధుల ప్రతిపాదనలు బడ్జెట్‌లో కానరాలేదు.

ఐటీ పరిశ్రమలు

ఐటీ పరిశ్రమ హైదరాబాద్‌కు పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నరాలకు విస్తరించేందుకు ప్రణాళికలను రచిస్తున్నట్టు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అత్యంత అధునాతనమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ఐటీ రంగంలో నైపుణ్యం మరింత వృద్ధి చెందేలా తమ ప్రభుత్వం నూతన విధానాన్ని రూపొందిస్తున్నట్టు మంత్రి భట్టి ప్రకటించారు. దీనివల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా ఐటీ పరిశ్రమల స్థాపనకు మార్గం సుగమం

మిగతా 8వ పేజీలో

విద్యారంగానికి అరకొర నిధులే..

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 10: కొత్త ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి బాటలు వేస్తుందనే ఆశలు బడ్జెట్ కేటాయింపుతో ఆవిరైనట్లు విద్యారంగ నిపుణులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన కాంగ్రెస్ పార్టీ.. శుక్రవారం ప్రకటించిన బడ్జెట్‌లో 7.75శాతం అంటే కేటాయింపుల్లో సగానికే నిధుల కేటాయింపుతో పరిమితమైంది. రాష్ట్రంలోని 26వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్వహణకు ఎలాంటి నిధులు కేటాయించపోవడంపై ఉపాధ్యాయులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అయితే రాష్ట్రంలో రూ.500కోట్లతో కొత్తగా ఇంటర్నేషనల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించడం ప్రభుత్వ విద్యారంగంలో కార్పొరేట్ స్థాయి బోధనకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో రూ.19,093కోట్లు (బడ్జెట్‌లో 6.5శాతం) కేటాయిస్తే, ప్రస్తుతం బడ్జెట్‌లో రూ.21,389కోట్లు (7.75 శాతం)నిధులను కేటాయించింది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల అభివృద్ధి కోసం రూ.3వేల కోట్లు కోరగా, అందుకోసం రూ.500కోట్లు మాత్రమే నిధులు కేటాయించడంతో రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల అభివృద్ధి కుంటుపడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఏసీపీల బదిలీలకు రంగం సిద్ధం!

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 10: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)ల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఇటీవల పెద్దఎత్తున ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగాక ఏసీపీల బదిలీలపై ఉన్నతాధికారులు దృష్టిసారించారు. ఒకటి, రోజుల్లో బదిలీలు, పోస్టింగ్‌ల జాబితా బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు నెల రోజులుగా కమిషనరేట్ పరిధిలోని 9 పోలీసు డివిజన్‌లతో పాటు 9 వివిధ పోలీసు విభాగాలకు ఏసీపీ స్థాయి పోలీసు అధికారులను నియమించేందుకు కసరత్తు జరుగుతోంది. ఈ క్రమంలో కొందరు ఏసీపీలు తమ గాడ్‌ఫాదర్ల చుట్టూ పదక్షిణలు చేస్తుండగా, మరి కొందరు ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ కాలికి బలపం కట్టుకుని తిరుగుతున్నారు. కొందరు అధికారులు ఎమ్మెల్యేల నుంచి సిఫారసు లెటర్లు తీసుకుని డీజీపీ కార్యాలయానికి పంపించి ఒక అడుగు ముందుగానే ఉన్నట్టు తెలుస్తోంది. కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల పరిధిలో 18 ఏసీపీ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో లా అండ్ ఆర్డర్‌తోపాటు వివిధ విభాగాలు సీపీ పరిధిలో పని చేస్తాయి. హనుమకొండ, వరంగల్, కాజీపేట, నర్సంపేట, పరకాల, మామునూరు, వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, జన గామ, వరంగల్ ట్రాఫిక్ పోలీసు డివిజన్‌లతో పాటు ఎస్‌బీ -1, ఎస్‌బీ - 2, టాస్క్‌ఫోర్స్, సీసీఎస్, సీసీఆర్‌బీ, సైబర్‌క్రైం, వర్టికల్స్, నార్కోటిక్స్ విభాగాలు ఉన్నాయి. ఒక్కో విభాగానికి ఒక ఏసీపీ స్థాయి అధికారి పర్యవేక్షణలో అక్కడి సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. కానీ వివిధ విభాగాలు, పొరుగు జిల్లాల్లో పని చేస్తున్న ఏసీపీ స్థాయి అధికారులు ఇక్కడి పోస్టింగ్‌లపై కన్నేశారు.

ఇదిలా ఉంటే కమిషనరేట్ పరిధిలో పనిచేస్తే దండిగా డబ్బులు దండుకోవచ్చని, పాత పరిచయాలతో నాలుగు రాళ్లు వెనకేసుకోవచ్చని నేతల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. కొందరు డబ్బులు చెల్లించి పోస్టింగ్‌లు భర్తీ చేసుకోగా, మరి కొందరు మీ కోసమే పని చేస్తామనే హామీతో సిఫారసు లెటర్లు పొందినట్టు ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా హనుమకొండ, వరంగల్, నర్సంపేట, పరకాల, కాజీపేట ఏసీపీ పోస్టులకు తీవ్ర పోటీ నెలకొంది. వెస్ట్‌జోన్‌లో పని చేస్తున్న ఓ అధి కారి హనుమకొండకు, ఈస్ట్‌జోన్‌లో పని చేస్తున్న ఓ అధికారి వరంగల్‌కు, సెంట్రల్‌జోన్‌లో పని చేస్తున్న ఇద్దరు అధికారులు నర్సంపేట, పరకాలకు తీవ్ర పోటీ పడుతున్నట్టు సమాచారం. ఇంకా పొరుగు జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు ఒకరు సెంట్రల్‌జోన్‌లోని కాజీపేటకు, హైదరాబాద్‌లో ఉన్న అధికారి ట్రాఫిక్ విభాగానికి వచ్చేందుకు పావులు కదుపుతున్నారు. కాగా, ఒక్క ఏసీపీ పోస్టుకు రూ. 10 నుంచి 20లక్షల వరకు పలుకుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆరుగురు అధికారులు ప్రజాప్రతినిధుల నుంచి సిఫారసు లెటర్లు పొంది సీపీ కార్యాలయం నుంచి డీజీపీ కార్యాలయానికి పంపించినట్టు తెలుస్తోంది.

కాగా, ఏసీపీల బదిలీలు పారదర్శకంగా జరిగేనా? అనే అనుమానాలు పోలీసు వర్గాల్లో వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల జరిగిన సీఐల పోస్టింగ్‌లలో కొందరు ఎమ్మెల్యేలు తమకు అనుకూలంగా ఉండే అధికారులకు పోస్టింగ్‌లు ఇచ్చుకున్నట్టు సమాచారం. కాగా ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీ పోస్టింగ్‌లలో ఓ ఆర్ఐ (రిజర్వ్ ఇన్‌స్పెక్టర్), ఓ ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ చక్రం తిప్పుతున్నట్టు విశ్వసనీయ సమాచారం.

మేడిగడ్డకు సీఎం రేవంత్‌రెడ్డి

- 13వ తేదీన ఎమ్మెల్యేలతో కలిసి బ్యారేజీ పరిశీలన
- అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి
- అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాళేశ్వరం అవినీతిపై దృష్టి
- ప్రజల్లోకి బీఆర్ఎస్ అవినీతిని తీసుకెళ్లేలా కాంగ్రెస్ వ్యూహం



వరంగల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 13న మేడిగడ్డ బ్యారేజీ పరిశీలనకు వస్తున్నట్లుగా ప్రకటించారు. ఈ మేరకు సీఎం అసెంబ్లీలో ఎమ్మెల్యేలతో కలిసి మేడిగడ్డ బ్యారేజీ పరిశీలనకు వెళుతున్నట్లు ప్రకటించారు. దీంతో సీఎం, ఎమ్మెల్యేల పర్యటనల నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు కూడా మేడిగడ్డ పర్యటనకు వచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. అయి తే బీఆర్ఎస్ శాసనసభ పక్ష నేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కూడా మేడిగడ్డకు రావాలని సీఎం ఆహ్వానించారు.

బాధ్యులపై సర్కారు కొరడా

గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, అక్రమాలపై కొత్త ప్రభుత్వం దృష్టి పెట్టింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ 20వ పిల్లర్ కుంగిపోయింది. నాణ్యత లోపంతోనే బ్యారేజీ కుంగిందని, తాము అధికారంలోకి రాగానే కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. స్వయంగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ సైతం గత ఏడాది నవంబరు 2వ తేదీన బ్యారేజీ పరిశీలించారు. డిసెంబరు 7న కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిపెట్టారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలోని లోపాలతో పాటు బాధ్యులను గుర్తించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారుల బృందం నెల రోజులు వివిధ ప్రాంతాల్లో తనిఖీలు, ఫైల్స్ స్వాధీనం, ఇంజనీర్ల విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో భారీ అక్రమాలు జరిగినట్లుగా, నాణ్యత లోపంతో పాటు డిజైన్ లోపం ఉన్నట్లుగా గుర్తించారు. దీంతో సాగునీటి శాఖ ఈఎన్‌సీ (జనరల్) మురళీధర్‌ను రాజీనామా చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. అలాగే రామగుండం ఈఎన్‌సీ, కాళేశ్వరం ఇన్‌చార్జి నల్లా వెంకటేశ్వర్లను పదవిని తొలిగించింది.

బీఆర్ఎస్ అవినీతిని ఎండగట్టేలా..

మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోడంపై అప్పటి కేసీఆర్ ప్రభుత్వంలో బాధ్యులు ఎవరనేదానిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిపెట్టింది. మేడిగడ్డ బ్యారేజీలోని లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. డిసెంబరు 11వ తేదీన భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో జలసౌధలో నీటిపారుదశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రిపోర్టు మొత్తం తమకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆతరువాత డిసెంబరు 16వ తేదీన శాసన మండలిలో సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తామని ప్రకటించారు. డిసెంబరు 17వ తేదీన నీటిపారుదలశాఖ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై సమీక్ష చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపైన, మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి గల కారణాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి పూర్తి నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. డిసెంబరు 18వ తేదీన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాళేశ్వరం చీఫ్ ఇంజనీర్లు మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, బినాగేంద్రతో పాటు ఎల్అండ్‌టీ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ దేశాయ్ తదితరులతో మేడిగడ్డపై సమీక్ష నిర్వహించారు. కుంగిన మేడిగడ్డ బ్యారేజీని ఎల్అండ్‌టీ కంపెనీ పునరుద్ధరించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒత్తిడి తెచ్చారు. ఆ తరువాత డిసెంబరు 29వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల బృందం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి కుంగిన ప్రాంతాన్ని పరిశీలించింది. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగస్వామ్యమైన ఈఎన్‌సీలు మురళీధర్, నల్ల వెంకటేశ్వర్లుతో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇప్పించారు. మీడియాతో పాటు మంత్రుల బృందం పర్యటనతో ప్రజల్లో మేడిగడ్డ బ్యారేజీ కుంగటంపై ఆసక్తి కలిగింది. అయితే తాజాగా స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డ పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 13వ తేదీన ఎమ్మెల్యేలతో కలిసి మేడిగడ్డ బ్యారేజీని పరిశీలిస్తామని, అసెంబ్లీ నుంచే ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. కాగా, మొత్తానికి మేడిగడ్డ బ్యారేజీలో జరిగిన అవినీతి ప్రజల్లోకి పూర్తి స్థాయిలో తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సీఎం, ఎమ్మెల్యేల పర్యటన నేపథ్యంలో మేడిగడ్డ వద్ద భారీ భద్రత ఏర్పాట్లకు డీజీపీ నుంచి పోలీసులకు ఆదేశాలు అందాయి.



శివనగర్‌లోని కార్మిక పరపతి సంఘం సెంటర్‌ను వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య

‘గృహజ్యోతి’ దరఖాస్తుల లోపాలను సరిచేయండి..

తప్పులు లేకుండా నమోదు చేయాలి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 10: ప్రజాపాలన కార్యక్రమంలో గృహజ్యోతి పథకం గ్యాస్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలు అసంపూర్ణంగా ఉండటంతో వాటిని సరిచేసి వేగవంతంగా యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ 33వ డివిజన్‌లోని శాంతినగర్, మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్, శివనగర్, కార్మిక సంఘం తదితర ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటించారు. ఈ ప్రాంతాల్లో వివరాలు సేకరించి అసంపూర్ణంగా ఉన్న వాటి స్థానంలో యాప్‌లు నమోదుచేసే కార్యక్రమం విధుల నిర్వహణలో ఉన్న ఆర్పీలు, మెప్మా సిబ్బంది, అంగన్‌వాడీలు, ఐకేపీలకు తగు సూచనలు ఇచ్చారు. దరఖాస్తుల్లో తప్పిద సమాచారాన్ని సవరించడానికి శనివారం ఒక రోజు గడువు ఇచ్చిన క్రమంలో నమోదు ప్రక్రియ చేపట్టారు. అధికారుల నుంచి ఫోన్ రాగానే గ్యాస్ సంబంధిత సమగ్ర సమాచారం అందించి లేదా ఆ నంబర్‌కు వాట్సాప్ ద్వారా గ్యాస్ కన్జూమర్ నంబర్ గ్యాస్ కంపెనీ పేరును సిబ్బందికి తెలుపాలని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శివప్రసాద్‌రెడ్డి, మెప్మా సిబ్బందిపాల్గొన్నారు.

ఈవీఎం చెకింగ్‌ల పరిశీలన

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాబోవు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఈవీఎంల మొదటి దశ చెకింగ్ కార్యక్రమం ఏనుమాములలోని స్ట్రాంగ్ రూం గదిలో కొనసాగుతున్నాయి. శనివారం కలెక్టర్ ప్రావీణ్య ఈవీఎం తనిఖీ చెకింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈవీఎంల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, ఈసీఐఎల్ ఇంజనీర్లు ఎన్నికల సూపరింటెండెంట్ బి. విశ్వనారాయణ పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందించిన ఉద్యోగులు

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఫిబ్రవరి 16న జరగనున్న సమ్మెకు సంబంధించి నోటీసును డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాష్‌కు శనివారం అందజేశారు. రాష్ట్ర హెల్త్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి రాజేష్‌ఖన్నా ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సీహెచ్.విద్యాసాగర్‌రెడ్డి, మేరుగు అనిల్‌కుమార్, నూర సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

- ఖిలావరంగల్: గృహజ్యోతి పథకంలో గ్యాస్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్న వివరాలను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య, ఇన్‌చార్జ్ కమిషనర్ రాధిక గుప్తాలు అన్నారు. శనివారం 34 డివిజన్ శివనగర్‌లోని కార్మిక పరపతిసంఘంలో ఏర్పాటు చేసిన సెంటర్‌ను సందర్శించారు.

ప్రాథమిక శిక్షణ ఎంతో దోహదం: సీపీ



డ్రిల్ నర్సరీని ప్రారంభిస్తున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా

మామునూరు, ఫిబ్రవరి 10 : ఉద్యోగ నిర్వహణలో పోలీసులకు ఇచ్చే ప్రాథమిక శిక్షణ ఎంతగానో దోహదం చేస్తుందని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. 43వ డివిజన్ మామునూరు పోలీసు శిక్షణ కళాశాలలో నూతనంగా నిర్మించిన డ్రిల్ నర్సరీని శనివారం సీపీ ప్రారంభించారు. ఉద్యోగంలో చేరగానే యువ పోలీసులు తీసుకునే శిక్షణ విధి నిర్వహణలో జీవిత కాలం ఉపయోగపడుతుం దన్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా పోలీసులు పని చేయాల్సి ఉంటుందన్నారు. పోలీసు శిక్షణ కళాశాలలో కొత్త పోలీసులకు ఇచ్చే శిక్షణ సమాజంలో శాంతి భద్రతలను కాపాడుతుందని సీపీ చెప్పారు. కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ, వరంగల్ క్రైం డీసీపీ దాసరి మురళీధర్, మామునూరు ఏసీపీ సతీష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ కమాండెంట్లు మన్నె భిక్షపతి, పాండు నాయక్, సీఐలు చంద్రశేఖర్, నవీన్, మహేష్, సీఎల్‌ఐలు నరేష్, అశోక్, రాజ్యలక్ష్మీ, ఏసీడీఐలు దశరథం, రాజేష్, సుధాకర్, ఏఎల్‌ఐలు దీపక్, సుధాకర్, దేవేందర్ రెడ్డి, సమ్మిరెడ్డి, ఏవో కల్పన రెడ్డి, యూనిట్ వైద్యాధికారి డాక్టర్ సుధీర్, పీఆర్‌వో రామాచారి పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌గా ఆదిలక్ష్మి

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 10: రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ అధికారుల బదిలీల్లో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా కె.ఆదిలక్ష్మి నియమితులయ్యారు. వెయిటింగ్ పోస్టింగ్ కోసం ఉన్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న ఆదిలక్ష్మికి వరంగల్ అడిషనల్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఇక్కడ పనిచేసిన అదనపు కలెక్టర్ కే.శ్రీవాత్స నాలుగు నెలల క్రితం గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్‌గా వెళ్లగా అప్పటి నుంచి పోస్టు ఖాళీగా ఉంది. ఆస్థానంలో ఆదిలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

తహసీల్దార్ల బదిలీలు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 10: రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తు న్న సూపరింటెండెంట్‌లకు శనివారం ప్రభుత్వం స్థాన చలనం కలిగించింది. వీరిలో జి.సదానందం ములుగు తహసీల్దార్‌గా, జి.జగదీశ్వర్ నిర్మల్‌కు బదిలీ అయ్యారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెంలో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ కె.చంద్రశేఖర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న టి.మంజుల ఇద్దరు వరంగల్‌కు బదిలీపై వస్తున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేశాక విధులకు హాజరు కానున్నారు.

మేడారం జాతరలో నష్టపోయిన వ్యాపారులకు న్యాయం చేస్తాం..

ఎస్పీ హామీ ఇచ్చారు : పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు

మేడారం, ఫిబ్రవరి 10: వనదేవతల గద్దెల ముఖద్వారం వద్ద ఏర్పాటైన దుకాణాలను అధికారులు తొలగించిన ఘటనలో నష్టపోయిన వ్యాపారులకు న్యాయం చేస్తామని ఎస్పీ శబరీశ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు తెలిపారు. ఈ సంఘటన జరిగిన అనంతరం ఎస్పీ తనతో నేరుగా మాట్లాడారని చెప్పారు. గద్దెల ముఖద్వారం వద్ద పలువురు వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేయగా భక్తుల రద్దీ నేపథ్యంలో ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో అదనపు కలెక్టర్ శ్రీజ శుక్రవారం రాత్రి వాటిని ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగింపజేసిన విషయం విదితమే. దీనిపై వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిసేపు అక్కడ నిరసనకు దిగారు. అధికారులు దుకాణాలను ధ్వంసం చేశారని, దీంతో నష్టపోయామని మండిపడ్డారు.

ఈ క్రమంలో ఎస్పీ శబరీశ్ తనతో నేరుగా మాట్లాడారని జగ్గారావు తెలిపారు. జరిగిన నష్టాన్ని వెంటనే భర్తీ చేస్తామని చెప్పారని పేర్కొన్నారు. వ్యాపారులు ఈ ఘటనను మరిచిపోయి జాతర విజయవంతానికి కృషి చేయాలని ఎస్పీ కోరారని తెలిపారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ద్వారా నష్ట అంచనాను వేశారని అన్నారు. జాతర సమీపిస్తుంటడంతో భక్తుల సౌకర్యాల దృష్ట్యా షాపులను తొలగించినట్టు స్పష్టం చేశారని జగ్గారావు తెలిపారు. అందరి సహకారంతోనే మహాజాతర విజయవంతమవుతుందని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారని చెప్పారు.

తాటికొండ దారెటు..?

కాంగ్రెస్‌లో చేరేందుకు రాజయ్య తీవ్రంగా ప్రయత్నాలు ● అపాయింట్‌మెంట్ ఇవ్వని కాంగ్రెస్ ఢిల్లీ నేతలు



వరంగల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కాంగ్రెస్‌లో చేరికకు బ్రేకులు పడుతున్నాయి. రాజయ్యను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని ఒకవైపు సొంత నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనలు చేస్తుంటే.. మరోవైపు ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలు సైతం రాజయ్యకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా దాటవేస్తున్నారు. దీంతో రాజయ్య బీఆర్ఎస్‌ను వీడే విషయంలో తొందరపడ్డారా? అనే చర్చ జరుగుతోంది.

3న బీఆర్ఎస్‌కు రాజీనామా

స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఈనెల 3వ తేదీన బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా ప్రకటించారు. తనకు పార్టీలో గౌరవం లేదని, కొన్నాళ్లుగా పార్టీలో క్షోభ అనుభవించానని ప్రకటించారు. త్వరలోనే ఏ పార్టీలో చేరేది వెల్లడిస్తానని తెలిపారు. అయితే ఈనెల 10వ తేదీన కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు మీడియాకు లీకులు ఇచ్చారు. దీంతో రాజయ్య శనివారం కాంగ్రెస్‌లో చేరుతారని ఆయన అభిమానులు ఎదురుచూస్తు ఉండిపోయారు. అయితే రాజయ్య కాంగ్రెస్‌లోకి రావడాన్ని స్థానిక కాంగ్రెస్ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎట్టి పరిస్థితుల్లో రాజయ్యను పార్టీలోకి చేర్చుకోవద్దంటూ పార్టీ శ్రేణులు, ముఖ్యంగా మహిళ కార్యకర్తలు గాంధీభవన్ వద్ద ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేశారు. అయితే ఇవేమీ పట్టించుకోకుండా రాజయ్య శనివారం ఉదయమే ఢిల్లీకి వెళ్లారు. తెలంగాణ ఉద్యమంలో తాను పోషించిన పాత్రతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్‌లో తనకు ఉన్న బలం, బలగంతో కూడిన 30పేజీల నివేదికను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గేకు పంపించారు. అయితే అక్కడి నుంచి పార్టీలో చేరేందుకు ఎలాంటి పిలుపు రాకపోవటంతో తెలంగాణ భవన్‌లో రాత్రి వరకు ఎదురుచూసినట్లు సమాచారం. ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ.వేణుగోపాల్ అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించినప్పటికీ ఫలితం లేదని సమాచారం. టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా మాత్రమే పార్టీలోకి రావాలని, సీఎంను కాదని తాము పార్టీలో చేర్చుకోలేమని కాంగ్రెస్ పెద్దలు తమ పీఏల ద్వారా తేల్చి చెప్పినట్టుగా ప్రచారం జరుగుతోంది.

కాగా, రాజయ్య చేరికకు ఓ మంత్రి సీఎం రేవంత్‌రెడ్డిని తొలుత ఒప్పించినట్లుగా సమాచారం. అయితే రాజయ్య రాజీనామాతో నియోజకవర్గంలో వ్యక్తమవుతున్న ఆందోళనలతో సీఎం సైతం వెనక్కి తగ్గినట్లుగా తెలిసింది. దీంతో రాజయ్య కాంగ్రెస్‌లో చేరికకు బ్రేకులు పడుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఆదివారం మరోసారి ప్రయత్నాలు చేయాలని రాజయ్య నిర్ణయించుకున్నట్లుగా సమాచారం. పార్టీలో చేర్చుకునేందుకు హామీ ఇచ్చిన మంత్రి సైతం ఫోన్ స్విచ్ఛాఫ్ చేయటంతో రాజకీయంగా రాజయ్య ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. అయితే కాంగ్రెస్ నుంచి సరైన హామీ లేకుండా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి రాజయ్య తొందరపడ్డారనే టాక్ వినబడుతోంది.

సీఐలు, ఎస్ఐల బదిలీలు

9మంది ఇన్‌స్పెక్టర్లు, 10 మంది ఎస్ఐలకు స్థానచలనం

ఉత్తర్వులు జారీ చేసిన సీపీ అంబర్ కిషోర్ ఝా

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 10: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 9 మంది ఇన్‌స్పెక్టర్లు, 10 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల తర్వాత తొలి విడతగా మూడు రోజుల కిందట 29 మంది ఇన్‌స్పెక్టర్లు బదిలీ కాగా, తాజాగా మరో 9 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ జరిగింది. అయితే కొందరు ఒకే చోట ఎక్కువ కాలం పని చేయడంతో బదిలీ చేయగా, మరికొందరికి బదిలీ అయిన వారి స్థానాల్లో పోస్టింగ్ ఇచ్చారు. పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు.

సీఐల విభాగంలో..

పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రదేశం
ఎస్.వాసుదేవరావు	కమిషనరేట్	సుబేదారి
ఎం.ఏ షుకూర్	సుబేదారి	సీసీఆర్‌బీ
బి.రాజగోపాల్	కమిషనరేట్	పర్వతగిరి
సీహెచ్.శ్రీధర్	కమిషనరేట్	కేయూసీ
పి.రంజిత్‌రావు	కమిషనరేట్	శాయంపేట
డి.మల్లేశ్	శాయంపేట	మల్టీజోన్ ఐజీ అటాచ్
జి.మహేందర్‌రెడ్డి	వీఆర్	పాలకుర్తి
పి.దయాకర్	కమిషనరేట్	టాస్క్‌ఫోర్స్
ఎ.రాంబాబు	టాస్క్‌ఫోర్స్	మల్టీజోన్ ఐజీ అటాచ్

ఎస్ఐల విభాగంలో..

పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రదేశం
ఎన్.చెన్నకేశవులు	హనుమకొండ	దేవరుప్పుల
కె.శ్రవన్‌కుమార్	దేవరుప్పుల	వీఆర్
ఎం.సాయిప్రసన్నకుమార్	ఇంతేజార్‌గంజ్	పాలకుర్తి
టి.శ్రీకాంత్	పాలకుర్తి	వీఆర్
వి.సందీప్	హనుమకొండ	రాయపర్తి
డి.విజయ్‌కుమార్	రాయపర్తి	వీఆర్
అయ్యల శ్వేత	గీసుగొండ	తరిగొప్పుల
డి.నరేష్	తరిగొప్పుల	వీఆర్
బి.హరికృష్ణ	స్టేషన్ ఘన్‌పూర్	పీటీసీ వరంగల్
బి.రవీందర్	పరకాల	వీఆర్

అన్నీ మంచి శకునములే..

నేటి నుంచి శుభముహూర్తాలు

సుబేదారి, ఫిబ్రవరి 10: పెళ్లి మంగళవాయిద్యాలకు మంచిరోజులొచ్చాయి. నెల రోజుల విరామం తర్వాత శుభముహూర్తాలు వచ్చాయి. పుష్యమాసం (శూన్యమాసం) కావడంతో శుభ కార్యక్రమాలు ఇన్ని రోజులు జరగలేదు. శనివారం నుంచి మాఘమాసం ప్రారంభమైంది. దీంతో నేటి (ఆదివారం) నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు అన్ని మంచి రోజులు కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేల సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. ఈ నెల 14వ తేదీన వసంత పంచమి ఉండటంతో పెద్ద సంఖ్యలో శుభ కార్యాలకు ముహూర్తాలు ఉన్నాయి.

ఏప్రిల్ 9న ఉగాది తర్వాత ఏప్రిల్ 10 నుంచి 24 వరకు మాత్రమే మంచి రోజులు ఉన్నాయి. ఏప్రిల్ 30 నుంచి జూలై 10వ తేదీ వరకు గురు మూఢమి, శుక్రమూఢమి ఉన్నందున ఈ సారి మే, జూన్ మాసాల్లో మంచి రోజులు లేవని పురోహితులు అంటున్నారు. ఫిబ్రవరి నెలలో 13, 14, 17, 18, 24, 28, 29, మార్చి నెలలో 2, 3, 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30, ఏప్రిల్ నెలలో 3, 4, 9, 18, 19, 20, 21, 22, 24 తేదీలలో మంచి రోజులు ఉన్నాయి.

మేడారం జాతరకు బస్ టికెట్ చార్జీల ఖరారు

సుబేదారి, ఫిబ్రవరి 10: వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు సమ్మక్క, సారలమ్మల జాతర జోరుగా సాగనుంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు మేడారం వెళ్లడానికి బస్సుల చార్జీలను ఖరారు చేశారు. హనుమకొండ బస్‌స్టేషన్, కాజీపేట, వరంగల్, పరకాల, చిట్యాల నుంచి మేడారంకు పెద్దలకు రూ.250కాగా, పిల్లలకు (5ఏళ్ల నుంచి 12 ఏళ్లలోపు) రూ.140చార్జీ చేయనున్నారు. అలాగే జనగామ నుంచి పెద్దలకు రూ.370, పిల్లలకు రూ.210, హైదరాబాద్ నుంచి పెద్దలకు రూ.550, పిల్లలకు రూ.310, హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి పెద్దలకు రూ.600, పిల్లలకు రూ.320, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి పెద్దలకు రూ.300, పిల్లలకు రూ.180, నర్సంపేట నుంచి పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.150, కొత్తగూడ నుంచి పెద్దలకు రూ.300, పిల్లలకు రూ.170 ఖరారు చేశారు.

మహబూబాబాద్ నుంచి పెద్దలకు రూ.350, పిల్లలకు రూ.190, గూడూరు నుంచి పెద్దలకు రూ.280, పిల్లలకు రూ.160, తొర్రూర్ నుంచి పెద్దలకు రూ.350, పిల్లలకు రూ.190. వర్ధన్నపేట నుంచి పెద్దలకు రూ.300, పిల్లలకు రూ.160 ఖరారు చేశారు. ఆత్మకూరు నుంచి పెద్దలకు రూ.210, పిల్లలకు రూ.120, మల్లంపల్లి నుంచి పెద్దలకు రూ.180, పిల్లలకు రూ. 110, ములుగు నుంచి పెద్దలకు రూ.150, పిల్లలకు రూ.90, భూపాలపల్లి నుంచి పెద్దలకు రూ.220, పిల్లలకు రూ.130, ములుగు గణపురం నుంచి పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.110, జంగాలపల్లి నుంచి పెద్దలకు రూ.150, పిల్లలకు రూ.90, పస్రా నుంచి పెద్దలకు రూ.80, పిల్లలకు రూ.50, గోవిందరావుపేట నుంచి పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.60, తాడ్వాయి నుంచి పెద్దలకు రూ.60, పిల్లలకు రూ.40గా టికెట్ చార్జీలు కేటాయించారు.



శిబిరంలో గ్రామస్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మనుగొండలో ఉచిత వైద్య శిబిరం

గీసుగొండ, ఫిబ్రవరి 10 : మనుగొండలో ఉచిత వైద్య శిబిరాన్ని కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలకిశోర్ రెడ్డి సొంత ఖర్చులతో శనివారం నిర్వహించారు. 150 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శోభారాణి, నాయకులు అల్లం మర్రెడ్డి, కొమ్ము శ్రీకాంత్, శివప్రసాద్, కందికొండ రాజు, మాదాసి రాంబాబు, అనిల్, కనకయ్య, నాగరాజు, కమలాకర్, కొమ్మాలు, రాము పాల్గొన్నారు.

పిల్లల కిడ్నాప్ వదంతులు నమ్మొద్దు : ఏసీపీ

మట్టెవాడ, ఫిబ్రవరి 10 : పిల్లలను కిడ్నాప్ చేసే గ్యాంగ్‌లు తిరుగుతున్నాయని, మత్తు పదార్థాలు ఇస్తూ కిడ్నాప్ చేస్తున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని, ఇలాంటి వదంతులను ఎవరూ నమ్మకూడదని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ కోరారు. సోషల్ మీడియాలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా కిడ్నాప్ వార్తలను వైరల్ చేస్తూ ప్రజలను భయంభ్రాంతులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరంగల్ ప్రాంతంలో ప్రస్తుతం పిల్లల్ని కిడ్నాప్‌చేసే గ్యాంగ్‌లు లేవని, తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని కోరారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని ఏసీపీ కోరారు.

'పార్టీకి కార్యకర్తలే మూలం.. వారే బలం'



సమావేశంలో మాట్లాడుతున్న నన్నపునేని నరేందర్

కరీమాబాద్, ఫిబ్రవరి 10 : పార్టీకి కార్యకర్తలే మూలమని, వారు లేకుంటే పార్టీలు, పాలకులు, నాయకులు ఉండరని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. శనివారం ఉర్సు కురుమవాడలో కార్పొరేటర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరేందర్ మాట్లాడుతూ కార్యకర్తలు ఎన్నికల్లో చాలా కష్టపడ్డారని, బీఆర్ఎస్ పార్టీ కోసం కష్టపడ్డారన్నారు. కార్యకర్తలే తన బలమని, వారికి వెన్నుదన్నుగా ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పుజారి విజయ్, ఇన్‌చార్జ్ వొగిలిశెట్టి అనిల్, మాజీ కార్పొరేటర్ మరుపల్ల భాగ్యలక్ష్మి, వనం మధు, కుమార్, కృష్ణ, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల జాబితాను త్వరగా పూర్తిచేయాలి



మహాలక్ష్మి లబ్ధిదారుల జాబితాను పరిశీలిస్తున్న అశ్వినీ తానాజీ వాకడే

గీసుగొండ, ఫిబ్రవరి 10 : అభయహస్తం ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా జాబితాను త్వరగా సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను అడిషనల్ కలెక్టర్ అశ్వినీతానాజీ వాకడే ఆదేశించారు. దరఖాస్తుల సవరణ ప్రక్రియను ఆమె శనివారం కొనాయిమాకులలో పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహాలక్ష్మి లబ్ధిదారుల వివరాల అప్‌డేషన్‌ను వెంటనే పూర్తిచేయాలన్నారు. మండలంలో 5,083 దరఖాస్తులు రాగా 2,645 మాత్రమే అప్‌డేషన్ కావడంతో కార్యదర్శులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీవో ప్రభాకర్ పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ దుకాణాలపై బల్దియా దాడులు

- ప్లాస్టిక్ దుకాణాలకు జరిమానా విధించిన సీఎంహెచ్‌వో



ప్లాస్టిక్ దుకాణాలను తనిఖీ చేస్తున్న సీఎంహెచ్‌వో రాజేశ్

మట్టెవాడ, ఫిబ్రవరి 10: వరంల్ పిన్నవారివీధి, పాత బీటుబజార్ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగిస్తున్న దుకాణాలపై గ్రేటర్ కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీన పర్చుకున్నారు. మొత్తం 8 దుకాణాలపై దాడులు చేసి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని, రూ.1.3 లక్షల జరిమానా విధించినట్లు కార్పొరేషన్ ముఖ్య ప్రజారోగ్య విభాగం అధికారి డాక్టర్ రాజేశ్ తెలిపారు. తనిఖీల్లో శానిటరీ సూపర్‌వైజర్లు మాదాసి సాంబయ్య, బేల నరేందర్, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

'జక్కలొద్ది ప్రభుత్వ భూములను కాపాడాలి'



జక్కలొద్ది గుడిసె వాసులతో మాట్లాడుతున్న రామ సందీప్

మామునూరు, ఫిబ్రవరి 10 : జక్కలొద్ది ప్రభుత్వ భూములను కాపాడాలని రామ సురేందర్ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామ సందీప్ డిమాండ్ చేశారు. 42వ డివిజన్ జక్కలొద్దిలో రామ సురేందర్‌నగర్ అభివృద్ధి కమిటీ కార్యదర్శి గుజ్జచంద్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో సందీప్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములపై రెవెన్యూ శాఖ అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో భూములు అన్యాక్రాంతం చేస్తున్నట్లు చెప్పారు. అనేక చోట్ల ప్రభుత్వ భూములు కబ్జా అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జక్కలొద్దిలో మూడేళ్ల క్రితం పేదలు గుడిసెలు వేసుకుంటే, వారిని కబ్జాదారులు దౌర్జన్యాలకు దిగుతున్నట్లు సందీప్ వాపోయారు. కార్యక్రమంలో గుడిసెవాసుల నాయకులు అనిల్, శ్యామ్, భరత్, విజయ్, కోటేశ్వర్, శివ, రాజు, నరేష్, ప్రభాకర్, సంపత్, సునీల్, సలీం, కిట్టు, లడ్డన్న, రమేష్, ప్రవళిక, శాహిన్, అనూష, సుకన్య, రవళి, అఖిల్, ఆది, సరిత, సుమలత, రేవతి, రాధిక, లావణ్య పాల్గొన్నారు.

బొడ్రాయి ఉత్సవాలకు ముస్తాబు





రంగశాయిపేటలో ముస్తాబు చేసిన యాగశాల, సిద్ధమైన బొడ్రాయి గద్దె

- నేటి నుంచి రంగశాయిపేటలో వేడుకలు
- 14న సచ్చితానంద సరస్వతీ స్వామి రాక

శంభునిపేట, ఫిబ్రవరి 10 : బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలకు రంగశాయిపేట ముస్తాబైంది. 11 నుంచి 14 వరకు వేడుకలకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. రంగశాయిపేట యూత్ ఫోర్స్(ఆర్‌వైఎఫ్), బొడ్రాయి ప్రతిష్ఠ యాగ నిర్వహణ కమిటీ బాధ్యులు ఏర్పాట్లను చేస్తున్నారు. రంగశాయిపేటలోని నెహ్రూ జంక్షన్‌తో పాటు రామాలయం వద్ద గ్రామ దేవతల విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు. ఈ మేరకు చలువ పందిళ్లు వేశారు. విద్యుత్ వెలుగులతో రంగశాయిపేటను ముస్తాబు చేశారు.

నేటి నుంచి ఉత్సవాలు..

ఆదివారం ఉదయం వేద బ్రాహ్మణులు వెలిదె నరసింహామూర్తి, ప్రభాకర శర్మ, భార్గవ శర్మ, ప్రదీప్ శాస్త్రిల చేతుల మీదుగా గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. గోపూజ, రక్షాబంధనం, మంత్ర జపములు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మహంకాళీ ఆలయ ప్రాంగణం నుంచి గ్రామ దేవతల విగ్రహాలను ప్రత్యేక రథంలో ఉంచి శోభాయాత్ర చేయనున్నారు. సోమవారం బొడ్రాయి యాగాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం యాగశాలను నిర్మించారు. గ్రామస్థులు సుమారు 5వేల మంది యాగం చేసేందుకు ఆర్‌వైఎఫ్ సభ్యులు రామాలయం, బొడ్రాయి కూడలిలో రోడ్డుపై యాగశాల లను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం గ్రామ ప్రజలు, ఆడ పడుచులు బిందెలతో గ్రామ దేవతల విగ్రహాలకు అభిషేకం(జలాదివాసం) చేయటం కొరకు మహంకాళీ ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. మంగళవారం సామూహిక కుంకుమ పూజ నిర్వహించనున్నారు. బుధవారం అర్ధ రాత్రి గ్రామాన్ని అష్టదిగ్బంధనం చేయనున్నారు. బుధవారం రాత్రి 11 గంటల నుంచి గురువారం తెల్లవారుజామున వరకు రంగశాయిపేట పొలిమేర ల్లోకి రాకపోకలను నిషేధించనున్నారు.

వేడుకలకు సచ్చితానంద సరస్వతీ స్వామి..

ఉత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం 11 గంటల 11 నిమిషాలకు తుని తపోవన ఆశ్రమాధీశ్వరులు శృంగేరి జగద్గురువు సచ్చితానంద సరస్వతీ మహాస్వామి చేతుల మీదుగా గ్రామ దేవతల ప్రతిష్ఠాపన చేయనున్నారు. అనంతరం గ్రామంలోని సుమారు 20వేల మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.



రంగశాయిపేటలో యాగశాలలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

ఇప్పటికే ప్రముఖులకు ఆహ్వానం

ఉత్సవాలకు రావాలని మంత్రి కొండా సురేఖ, మురళీధర్‌రావులతో పాటు, కలెక్టర్, సీపీ, గ్రేటర్ మేయర్, కమిషనర్, ఆర్టీసీ, పోలీసు, రెవెన్యూ వివిధ శాఖల ఉన్నతాధికారులకు ఆహ్వానాలు పంపించారు. ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా మంత్రి కొండా సురేఖమురళీధర్‌రావులు పాల్గొననున్నారు. వేడుకలకు విదేశాల్లో స్థిరపడిన వారు స్వగ్రామాలకు తిరిగి వస్తున్నారు. కాగా, ఉత్సవాలను విజయవంతం చేయాలని రంగశాయిపేట యూత్ ఫోర్స్, ఉత్సవ నిర్వహణ కమిటీ బాధ్యులు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే అరూరికి ఆహ్వానం



అరూరి రమేష్‌ను ఆహ్వానిస్తున్న ప్రతిష్ఠ మహోత్సవ నిర్వాహకులు

మామునూరు: రంగశాయిపేటలో జరిగే బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవానికి రావాల్సిందిగా వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్‌ను శనివారం నిర్వాహకులు ఆహ్వానించారు. హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలుసుకొని మహోత్సవానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఖిలా వరంగల్ ఫాక్స్ చైర్మన్ కేడల జనార్దన్, డైరెక్టర్ నోముల షణ్ముఖరెడ్డి, బొడ్రాయి ప్రతిష్ఠ కమిటీ సభ్యులు నాయిని అశోక్, గన్‌రాతి కుమార్, బీఆర్ఎస్ నాయకుడు నల్లతీగల కోటేశ్వర్ పాల్గొన్నారు.

'గ్రామీణ బంద్-కార్మిక సమ్మెను సక్సెస్ చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

గిర్మాజీపేట, ఫిబ్రవరి 10 : కేంద్రం అమలుచేస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 16న జరిగే సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ స్థాయి గ్రామీణ బంద్ -కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ పిలుపునిచ్చారు. శనివారం వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లోని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యాలయం ఓంకార్ భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు, కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. పెద్దారపు రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యవసాయ,పరిశ్రమల రంగాలను కార్పొరేట్ వర్గాలకు ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. దీంతో ఈ రంగాలపై ఆధారపడిన లక్షలాది చిన్న సన్నకారు రైతాంగం, కార్మికులు జీవనోపాధిని కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. సమావేశంలో నాయకులు గోనె కుమారస్వామి, రాచర్ల బాలరాజు, చిర్ర సూరి, కార్మిక సంఘాల నాయకులు ముక్కెర రామస్వామి, నర్ర ప్రతాప్, గన్నారపు రమేష్, పుల్ల రమేష్, జగదీశ్వర్, ఓదెల రాజన్న, ఇస్మాయిల్, చెన్న కేశవులు, ఎం.డి.ఖాసీం, లింగమూర్తి, గంగుల దయాకర్, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు నగేష్, అశోక్, పీరయ్య, పాణి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతోనే రాష్ట్రం అభివృద్ధి : బీజేపీ



తూర్పుకోటలో ఎర్రబెల్లి ప్రదీప్‌రావుతో పాటు బీజేపీ నాయకులు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 10: కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని బీజేపీ నాయకుడు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు అన్నారు. శనివారం తూర్పుకోట, గిరిప్రసాద్ నగర్, ఎంఎంనగర్, బుడిగ జంగాల కాలనీ బూత్ 213, 214లలో గావ్ చలో అభియాన్(పల్లెకు పోదాం పదండి) కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కాలనీలలో ఇంటింటికి కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి కరపత్రాలను అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమళ్ల మహేష్, 37వ డివిజన్ అధ్యక్షుడు గొల్ల రాజ్‌కుమార్, మిరియాల అరుణ్, వల్లెపు రాజు, రమేష్, నిరంజన్, నాగరాజు, శంకర్, నరసింహా, సంపత్, రామకృష్ణ, మల్లయ్య, ముఖేష్, కుమార్, రాకేష్, కేశవ్, నాగార్జున, పాషా, గొల్లన రవి, బొంత రాజు, సంపంగి రాజేందర్ పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామాలను సందర్శించిన కేంద్ర బృందం



మరియపురంలో వర్మీ కంపోస్టు తయారీని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

గీసుగొండ, ఫిబ్రవరి 10 : మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామాలు మరియపురం, గంగదేవిపల్లి, కొనాయిమాకుల గ్రామాల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ విభాగం డీ బ్లాక్ అధికారుల 16 మంది బృందం శనివారం సందర్శించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ పథకాల అమలును పరిశీలించారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టిన ఇంకుడు గుంతలు, నర్సరీలు, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, పల్లె ప్రకృతి వనాల గురించి అడిగి తెలుసుకున్నారు. మరియపురంలో తడిపొడి చెత్త ద్వారా వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీని, గంగదేవిపల్లిలో పీఎం మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లోన్ తీసుకొని ఆర్థికంగా ఎదిగిన కూసం సరోజనను బృందం అభినందించింది. కొనాయిమాకులలో స్త్రీశక్తి శానిటర్ న్యాప్‌కిన్ తయారీ యూనిట్‌ను పరిశీలించి ఆదాయ వ్యయాల గురించి వారు అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు అశ్వినివర్మ, రంజిత్ కుమార్, నిఖిల్, విష్ణుకుమార్ మీనా, కేఎస్ మీనా, కృష్ణకుమార్‌గుప్తా, ముఖేష్‌కుమార్, ప్రతాప్‌కుమార్, స్వచ్ఛ భారత్ జిల్లా కన్సల్టెంట్ శ్రీనివాసరావు, ఏపీడీ సాయిచరణ్, మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డి, ఎంపీటీసీ వీరారావు, ఎంపీవో ప్రభాకర్, ఏవో హరిప్రసాద్‌బాబు, ఏఈవో రజిని, ఏపీఎం సురేష్‌కుమార్, ఏపీవో చంద్రకాంత్, స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, కార్యదర్శులు స్వప్న, తపస్విని, హేమలత, ఈసీ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పది రోజుల్లో పారిశుధ్య సేవలు మెరుగవ్వాలి

- ఇన్‌చార్జి కమిషనర్ రాధిక గుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్ రాధిక గుప్తా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 10 : రానున్న పది రోజుల్లో నగరంలో పారిశుధ్య సేవలు మెరుగవ్వాలని జీడబ్ల్యూఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ రాధిక గుప్తా బల్దియా అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో అధికారులతో ఆమె సమీక్ష జరిపారు. పారిశుధ్య సేవలు, పన్నుల వసూళ్లు, తాగునీటి సరఫరా తదితర అంశాలను సమీక్షించి అధికారులకు సూచనలు చేశారు. ప్రతి డివిజన్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మేడారం జాతరకు వెళ్లే పారిశుధ్య కార్మికులు సమాచారాన్ని రూపొందించాలని, 50 ఏళ్లకు పైబడి, ఆరోగ్య సమస్యలతో ఉన్న కార్మికులను మినహాయించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్లు అనిసూర్ రషీద్, రవీందర్ యాదవ్, సీఎంహెచ్‌వో డాక్టరు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ సమాచార నమోదు పక్కాగా జరగాలి

అభయహస్తం గృహలక్ష్మి గ్యాస్ సిలిండర్ లబ్ధిదారుల సమాచార నమోదు పక్కాగా జరగాలని జీడబ్ల్యూఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ రాధిక గుప్తా అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండలోని జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో మెప్మా, అంగన్‌వాడీలతోపాటు బల్దియా శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. సమాచార నమోదు విషయంలో దిశా, నిర్దేశం చేశారు. గ్యాస్ సిలిండర్ సమాచార సేకరణలో గతంలో తప్పిదాలు జరిగాయన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఒకే రోజులో వీటి సవరణ పూర్తి చేయాలని ఆదేశించిన మేరకు శనివారం చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మొత్తం నగరంలోని 66 డివిజన్లలో క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపి నమోదు ప్రక్రియను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. కాగా, వరంగల్‌లోని సీఆర్‌సీ భవన్‌లో గ్యాస్ సమాచార నమోదు తీరును ఇన్‌చార్జి కమిషనర్ రాధిక గుప్తా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మరికొన్ని కేంద్రాలను ఆమె సందర్శించి సమాచార నమోదుపై సిబ్బందికి సూచనలు చేశారు.

కొంచెం చేదు.. కొంచెం తీపి..

(5వ పేజీ తరువాయి)

అవుతుంది. రాంపూర్‌లో ఉన్న ఐటీ పార్క్‌లో యూనిట్ల స్థాపనకు మరిన్ని ఐటీ కంపెనీలు ముందుకు వచ్చే అవకాశం ఉంది. గత ప్రభుత్వం తగిన చొరవ తీసుకోకపోవడం వల్ల ఈ ఐటీ పార్క్‌లో నాలుగు కంపెనీలు మాత్రమే తమ ఐటీ యూనిట్లను ఏర్పాటు చేసాయి.

పంచాయతీలకు నిధులు

పంచాయతీరాజ్ శాఖకు బడ్జెట్‌లో పెద్దపీటవేశారు. ఆరు గ్యారంటీల తర్వాత ఎక్కువ మొత్తంలో ఈశాఖకే నిధులు కేటాయించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి బడ్జెట్‌లో రూ.40,080 కోట్లను ప్రతిపాదించారు. ఉమ్మడి జిల్లాలో 1,680 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల పంచాయతీలు నిధులులేక నీరసించాయి. పల్లెల అభివృద్ధికి పలు కార్యక్రమాలను చేపట్టినా అమేరకు నిధులు ఇవ్వకపోవడంతో అధికారులు, ముఖ్యంగా సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సు ప్రకారం పంచాయతీలకు నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు గత ప్రభుత్వ హయాంలోకన్నా ఎక్కువ నిధులు అందే అవకాశం ఉంది.

నగరాభివృద్ధి

రాష్ట్రంలోని అన్ని పురప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి భట్టి వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు పట్టణ ప్రాంత అభివృద్ధికి నిధులను విడుదల చేస్తామని ప్రకటించారు. బడ్జెట్‌లో పురపాలక శాఖకు రూ.11,692 కోట్లు కేటాయించారు. గత ప్రభుత్వ బడ్జెట్‌లో కన్నా రూ.400కోట్లు ఎక్కువ. బడ్జెట్‌లో వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్‌రింగ్ రోడ్డు పనుల పూర్తికి ప్రత్యేకంగా నిధుల కేటాయింపు ప్రతిపాదనలేమీ కనిపించలేదు.

రూ.2 లక్షల రుణమాఫీ

రూ.2లక్షల రుణ మాఫీపై త్వరలోనే కార్యాచరణ ఉంటుందని, అందుకు విధి విధానాలను రూపొందిస్తున్నామని ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇది అమలులోకి వస్తే ఉమ్మడి జిల్లాలో లక్షా 50వేల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. గత ప్రభుత్వం రూ.లక్ష వరకే రుణమాఫీ చేసింది. ఇది కూడా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. రూ.2లక్షల వరకు రుణాల ప్రకటనతో రైతుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది.

రైతుబంధు

రైతు బంధు నిబంధనలను పునఃసమీక్షించి నిజమైన అర్హులకు రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలు అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్న ప్రకటనతో కూడా అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో 7.40 లక్షల మంది రైతులు లబ్ధి పొందుతారు. గత ప్రభుత్వం రైతు బంధు పథకం కింద రెండు విడతలుగా ఎకరానికి రూ.10వేలు అందచేసింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకివస్తే రైతుబంధు కింద ఎకరానికి రూ.15వేలు ఇస్తామని వాగ్దానం చేసింది తెలిసిందే. అన్నట్టే బడ్జెట్‌లో ఈ మేరకు ప్రతిపాదన చేసింది. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ. 19,746 కోట్లను ప్రతిపాదించింది.

మైనర్‌పై అత్యాచారయత్నానికి పాల్పడిన యువకుడి అరెస్టు

చెన్నారావుపేట, ఫిబ్రవరి 10 : బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన యువకుడిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం చిర్రకుంట తండాకు చెందిన బానోతు ఈరు చెన్నారావుపేట మండలంలోని ఓ గ్రామంలో 9వ తరగతి చదువుతున్న (14) సంవత్సరాల బాలిక పాఠశాలకు వస్తున్న క్రమంలో లిఫ్టు ఇచ్చి ద్విచక్ర వాహనాన్ని ఎక్కించుకున్నాడు. గ్రామ శివారులోకి రాగానే బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డారన్నారు. తప్పించుకున్న బాలిక జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలుపడంతో పోలీసులకు ఫిర్యాదు చేయటం జరిగిందన్నారు. నిందితుడు ఈరుపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

ఉలిక్కిపడ్డ.. ఉప్పరపెల్లి..

- గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారంటూ వదంతులు
- రాత్రంతా బైకులు, ట్రాక్టర్‌పై యువకుల సంచారం

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 10 : వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపెల్లి శుక్రవారం రాత్రి ఉలిక్కిపడింది. గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నారనే ప్రచారం సాగడంతో గ్రామస్థులు రాత్రంతా జాగారం చేశారు. గ్రూపులుగా ఏర్పడి గస్తీకాశారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అన్నారం గౌరయ్య సరోజన దంపతులు, వీరికి పెళ్లయిన కూతురు ఉంది. ఉప్పరపెల్లి నుంచి లోహిత గ్రామానికి వెళ్లే దారిలో ఇల్లు ఊరికి కాస్త దూరంగా ఉంటుంది. శుక్రవారం రాత్రి గౌరయ్యకు ఆరోగ్యం బాగా లేక స్థానిక వైద్యుడి వద్దకు వెళ్లగా, సరోజన ఇంటి బయట కూర్చొని ఉంది. అదే సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు చీరలో వచ్చి ఆమెతో పలు భాషల్లో మాట్లాడారు. దీంతో భయపడిన ఆమె ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుంది. వచ్చినవారు పలుమార్లు గట్టిగా తలుపు నెట్టి తీసేందుకు ప్రయత్నించారు. అవి తెరుచుకోకపోవడంతో అక్కడే ఉన్న మంచాన్ని తీసి ఇంటి దర్వాజకు అడ్డంగా పడేశారు. ఇంట్లో నుంచి సరోజన కేకలు వేయడంతో స్థానిక యువకులు గబ్బెట రాజేష్, సీనపెల్లి రాజు, చెలుకపెల్లి సంపత్‌లు అక్కడికి చేరుకున్నారు. వీరి రాకను గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు పారిపోతుండడం యువకులు గమనించారు.

రాత్రంతా గాలింపు..

పారిపోయిన గుర్తు తెలియని వ్యక్తులను పట్టుకునేందుకు స్థానిక యువకులు, ప్రజలు గ్రూపులుగా విడిపోయి బైకులు, ట్రాక్టర్‌పై తిరుగుతూ గాలించారు. ఇదే క్రమంలో రాజేష్ అనే యువకుడు వెంటనే 100 డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వగా పెట్రోలింగ్ వాహనంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సరోజన వద్ద వివరాలు సేకరించారు. అనంతరం గ్రామంలో పెట్రోలింగ్ చేశారు. వచ్చిన తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండడంతో గ్రామ పంచాయతీ మైకులో గ్రామస్థులను జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. గ్రామంలోకి గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ సూచించారు. దీంతో యువకులు గ్రూపులుగా ఏర్పడి రాత్రంతా గస్తీకాశారు.

వదంతులు నమ్మొద్దు : ఎస్సై

ఈ విషయమై ఎస్సై ప్రవీణ్ కుమార్ ని వివరణ కోరగా ఉప్పరపెల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారని మా దృష్టికి వచ్చిందని సంఘటన స్థలానికి చేరుకుని విచారిస్తే అలాంటిదేమి జరిగినట్లు ఆనవాళ్లు లేవన్నారు. పెట్రోలింగ్ వాహనంతో ఎప్పటికప్పుడు గస్తీ కాస్తున్నామని వాట్సాప్, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నిజమో అబద్ధమో తెలుసుకోవాలన్నారు. గతంలో ఎన్నడో జరిగిన వాటిని ప్రస్తుతం జరిగినట్లు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్పష్టం చేశారు.



ఉప్పరపెల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చిన ఇల్లు ఇదే



గుర్తు తెలియని వ్యక్తులు వచ్చినప్పుడు చూసిన అన్నారం సరోజన

తాగునీరు వృథాను పట్టించుకోని అధికారులు



ఖిలావరంగల్, ఫిబ్రవరి 10 : వరంగల్- ఖమ్మం రోడ్‌పై పైపులు పగిలి నాలుగు రోజుల నుంచి తాగునీరు వృథాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని ప్రజలకు నిత్యం తాగునీటి ఇబ్బందులే. ప్రజా ప్రతినిధులు, మునిసిపల్ అధికారులు నిత్యం చూస్తున్నా.. నీటి వృథాను అరికట్టక పోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు స్పందించిన వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL ఆదివారం 11 ఫిబ్రవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలి

ఎంపీపీ బాదావత్ విజేందర్

చెన్నారావుపేట, ఫిబ్రవరి 10 : ప్రభుత్వం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెను ప్రకారంగా నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీపీ బాదావత్ విజేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో హెచ్ఎంలతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్మికుల భోజన బిల్లులను సకాలంలో అందించాలన్నారు. ప్రతీ పాఠశాలలో స్కాంవెజర్‌ను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, మండల విద్యాశాఖాధికారి రత్నమాల, మండల నోడల్ అధికారి సరళ, హెచ్ఎంలు. పాల్గొన్నారు.

ఉలిక్కిపడ్డ.. ఉప్పరపెల్లి...

గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారంటూ వదంతులు



గుర్తు తెలియని వ్యక్తులు వచ్చిన ఇల్లు, సరోజన

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 10 : వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపెల్లి శుక్రవారం రాత్రి ఉలిక్కిపడింది. గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నారనే ప్రచారం సాగడంతో గ్రామస్తులు రాత్రంతా జాగారం చేశారు. గ్రూపులుగా ఏర్పడి గస్తీకాశారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అన్నా రం గౌరయ్య సరోజన దంపతులు ఉప్పరపెల్లి నుంచి లోహిత గ్రామానికి వెళ్లే దారిలో వీరి ఇల్లు ఊరికి కాస్త దూరంగా ఉంటుంది. శుక్రవారం రాత్రి గౌరయ్యకు ఆరోగ్యం బాగా లేక స్థానిక వైద్యుడి వద్దకు వెళ్లగా, సరోజన ఇంటి బయట కూర్చొని ఉంది. అదే సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు చీరలో వచ్చి ఆమెతో పలు బాషల్లో మాట్లాడారు. దీంతో భయపడిన ఆమె ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుంది. వచ్చినవారు పలుమార్లు గట్టిగా తలుపు నెట్టి తీసేందుకు ప్రయత్నించారు. అవి తెరుచుకోకపోవడంతో అక్కడే ఉన్న మంచాన్ని తీసి ఇంటి దర్వాజకు అడ్డంగా పడేశారు. ఇంట్లో నుంచి సరోజన కేకలు వేయడంతో స్థానిక యువకులు గజ్బెట రాజేష్, సీన పెల్లి రాజు, చెలుకపెల్లి సంపత్‌లు అక్కడికి చేరుకున్నారు. వీరి రాకను గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు పారిపోతుండడం యువకులు గమనించారు.

● రాత్రంతా గాలింపు...

పారిపోయిన గుర్తు తెలియని వ్యక్తులను పట్టుకునేందుకు స్థానిక యువకులు, ప్రజలు గ్రూపులుగా విడిపోయి బైకులు, ట్రాక్టర్లపై తిరుగుతూ గాలించారు. ఇదే క్రమంలో రాజేష్ అనే యువకుడు వెంటనే 100 డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వగా పెట్రోలింగ్ వాహనంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సరోజన వద్ద వివరాలు సేకరించారు. అనంతరం గ్రామంలో పెట్రోలింగ్ చేశారు. వచ్చిన తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండడంతో గ్రామ పంచాయతీ మైకులో గ్రామస్థులను జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. గ్రామంలోకి గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ సూచించారు. దీంతో యువకులు గ్రూపులుగా ఏర్పడి రాత్రంతా గస్తీకాశారు.

● వదంతులు నమ్మొద్దు...: ఎస్సై

ఈ విషయమై ఎస్సై ప్రవీణ్ కుమార్ ని వివరణ కోరగా ఉప్పరపెల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారని మా దృష్టికి వచ్చిందని సంఘటన స్థలానికి చేరుకుని విచారిస్తే అలాంటిదేమి జరిగినట్లు ఆనవాళ్లు లేవన్నారు. పెట్రోలింగ్ వాహనంతో ఎప్పటికప్పుడు గస్తీ కాస్తున్నామని వాట్సాప్, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నిజమో అబద్ధమో తెలుసుకోవాలన్నారు. గతంలో ఎన్నడో జరిగిన వాటిని ప్రస్తుతం జరిగినట్లు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్పష్టం చేశారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం..

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నల్లబెల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి, ఫిబ్రవరి 10: బీఆర్ఎస్ పార్టీ కోసం పని చేసే కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నర్సంపేట రూరల్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ.. కార్యకర్తలు ఓటమిని మరిచిపోయి పార్టీ కోసం మళ్లీ చురుకుగా పని చేయాలన్నారు. ఎవరైతే పార్టీ కోసం కష్టపడతారో వారిని పార్టీ తప్పకుండా గుర్తిస్తుందన్నారు. అలాగే పార్టీకి నష్టం జరిగే విధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించమన్నారు. అంతేకాక, రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కార్యకర్తలు, నాయకులు కలసి ఐక్యంగా పనిచేసి మెజారిటీని సాధించాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, మండల పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌పై అత్యాచారయత్నానికి పాల్పడిన యువకుడి అరెస్టు

చెన్నారావుపేట, ఫిబ్రవరి 10: బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన యువకుడిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మహబూబాద్ జిల్లా గూడూరు మండలం చిర్రకుట తండాకు చెందిన బానోతు ఈరు చెన్నారావుపేట మండలంలోని ఓ గ్రామంలో 9వ తరగతి చదువుతున్న (14) సంవత్సరాల బాలిక పాఠశాలకు వస్తుండగా లిఫ్టు ఇచ్చి ద్విచక్ర వాహనాన్ని ఎక్కించుకున్నాడు. గ్రామ శివారులోకి రాగానే బాలికపై హత్యాచారయత్నానికి పాల్పడ్డాడన్నారు. తప్పించుకున్న బాలిక జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలుపడంతో, వారు పోలీసులకు ఫిర్యాదు చేయటం జరిగిందన్నారు. నిందితుడు ఈరుపై కేసు నమోదు చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

బాలిక అదృశ్యం

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 10 : ఓ బాలిక అదృశ్యమైన సంఘటన నర్సంపేట పట్టణంలో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం నర్సంపేట పట్టణానికి చెందిన ఓ బాలిక ఈ నెల 9న ఉదయం ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో బాలిక తండ్రి తన కూతురు కనిపించకుండా పోయిందని, ఆచూకీ కనుక్కోవాలని పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 10 : నర్సంపేట మండలం ముత్తోజిపేటలో పేకాట స్థావరంపై స్థానిక పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న కీసర శ్రీను, ఎమ్డీ. అఖిల్‌పాష, గోదారి సదానందం, నంద్యాల సుధాకర్, ఎమ్డీ. అక్బర్‌పాష, కీసరి రవీందర్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.1640 నగదు స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ సీఐ డి. రమణమూర్తి తెలిపారు. ఎవరైనా చట్టవిరుద్ధమైన పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ దాడిలో కానిస్టేబుల్స్ బుర్ర రమేష్, శ్రీనివాస్, రవి, జగన్నాథం, చిరంజీవిలు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

జడ్పీ సీఈవో రాంరెడ్డి



గ్యాస్ కనెక్షన్ లింకేజీ తీరును పరిశీలిస్తున్న రాంరెడ్డి

పర్వతగిరి, ఫిబ్రవరి 10: అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని జడ్పీ సీఈవో గూడూరి రాంరెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంతో పాటు వడ్లకొండలో మహాలక్ష్మి పథకంలో భాగంగా గ్యాస్ లింకేజీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాలకు సంబంధించిన పత్రాలను అధికారులు, సిబ్బంది ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారని తెలిపారు. ఆయా పథకాల్లో ప్రజలు లబ్ధిపొందాలంటే తప్పనిసరిగా వారికి చెందిన పత్రాలను సిబ్బందికి అందజేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయించు కోవాలన్నారు. అనంతరం మండలకేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయం ఇరుకుగా ఉందని లైబ్రేరియన్ రాంచందర్ తెలపడంతో ఇటీవల నూతనంగా నిర్మించిన జీపీ బిల్డింగ్‌లోకి మార్చాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్‌కు సూచించారు. ఈకార్యక్రమంలో ఏపీవో సుశీల్‌కుమార్, కార్యదర్శి రఘు పాల్గొన్నారు.

● రాయపర్తి: మహాలక్ష్మి లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని జడ్పీ సీఈవో సూచించారు. మండలంలోని పెర్కవేడులో మహాలక్ష్మి సర్వేను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిషన్, సెక్రటరీ వెంకటేష్, కారోబార్ ఉపేందర్, వీవోఏ రమాదేవి, ఫీల్డ్ అసిస్టెంట్ దేవేందర్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల జాబితాను పరిశీలించిన అధికారులు

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్, పాపయ్యపేట, కోనాపురం, అక్కల్ చెడ, ఉప్పరపల్లి, లింగాపురం, చెన్నారావుపేటతో పాటు పలు గ్రామాలలోని గ్రామ పంచాయితీ కార్యాలయాలల్లో ప్రభుత్వం అందించే రూ. 500లకు గ్యాస్ లబ్ధిదారుల అర్హుల జాబితాను శనివారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాలల్లో గ్యాస్ ఉన్న లబ్ధిదారులకు పత్రాలను, నెంబర్‌లను సరిచేయటం జరిగింది. తప్పుగా ఉన్న వివరాలను సరిచేస్తూ అర్హుల వివరాలను గుర్తించారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారందరూ సబ్సిడీ గ్యాస్‌కు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీవో కల్పన, ఎంపీడీవో భారతి, మండల ప్రత్యేక అధికారి బాలకృష్ణ, రాజేందర్, వీరన్న, ఎంపీవో శ్రీధర్‌రాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మేడారంలో భక్తులు ప్లాస్టిక్ వినియోగించొద్దు

కన్స్యూమర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాకూర్ రతన్‌సింగ్



ప్లాస్టిక్‌రహిత మేడారం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

నర్సంపేట, ఫిబ్రవరి 10 : మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని కన్స్యూమర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రాకూర్‌రతన్‌సింగ్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్‌గోపాల్ భక్తులను కోరారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో శనివారం మేడారం జాతరకు వెళ్లే దారి చూపే ప్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపాటు మేడారం జాతరను ప్లాస్టిక్ రహిత జాతరగా గుర్తింపు తేవాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ మేడారం జాతరకు వెళ్లే భక్తులు జాతరలో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులను వినియోగించవద్దని సూచించారు. కార్యక్రమంలో కన్స్యూమర్‌ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి గిరగానిసుదర్శన్‌గౌడ్, విజిలెన్స్‌కమిటీ సభ్యుడు కాళీదాస్, మునిసిపల్ కమిషనర్ నాయిని వెంకటస్వామి, స్వయంకృషి సంస్థ ప్రతినిధి బెజ్జంకి ప్రభాకర్, ఛాయాసంస్థ కార్యదర్శి కోటడెవిడ్, నాగెల్లి సారంగంగౌడ్, కన్స్యూమర్‌ఫోరం మహిళా రాష్ట్రఉపాధ్యక్షురాలు మైసివసంత, యూత్ అధ్యక్షుడు ఎర్రబోయిన కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంపదతో ఆర్థికంగా బలోపేతం

ఉమ్మడి జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు మల్లేశం



రేకంపల్లిలో మాట్లాడుతున్న మల్లేశం

దుగ్గొండి, ఫిబ్రవరి10: మత్స్య సంపదతో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఆర్థికంగా బలోపేతం కావడానికి అవకాశం ఉంటుందని ఉమ్మడి జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు బూస మల్లేశం అన్నారు. మండలంలోని రేకంపల్లిలో 69 మందికి నూతనంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో సభ్యత్వం లభించిన సందర్భంగా శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మల్లేశం ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సభ్యులు పిల్లలను ఉన్నత చదువులు చదివించినట్లయితే భవిష్యత్‌లో ఉద్యోగాలలో స్థిరపడి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ముదిరాజ్ కులస్తులు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, హక్కులు, రిజర్వేషన్ల కోసం ఐక్యంగా ఉద్యమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ పారిశ్రామిక సహకార సంఘం చీఫ్ ప్రమోటర్ సోమయ్య జిల్లా అధ్యక్షుడు, డైరెక్టర్ పొన్నం మొగిలి, పొన్నం సాంబయ్య, తోటి రవి, నీరటి సాంబయ్య, కానుగుల సుధాకర్, బి. నర్సింహాస్వామి, పొన్నం కుమారస్వామి, శానబోయిన నర్సింహాస్వామి, ఐలయ్య, రవి, బొమ్మెనబోయిన కుమారస్వామి,శానబోయిన నర్సింహాస్వామి, రాజేందర్, రాంబాబు, పొన్నం వంశీ పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువతి మృతదేహం లభ్యం

నెక్కొండ, ఫిబ్రవరి 10 : నెక్కొండ మండలంలోని బొల్లికొండ ఎస్సారెస్పీ కెనాల్‌లో శనివారం గుర్తుతెలియని సుమారు ఇరవై ఐదు సంవత్సరాల వయస్సు కలిగిన యువతి మృతదేహం కొట్టుకొచ్చినట్లు ఎస్సై షేక్ జాన్‌పాషా తెలిపారు. ఈ మృతదేహం కుళ్లిపోయి, దుస్తులు లేని స్థితిలో ఉందని, ఎడమచేతిపై ఇంగ్లిష్ అక్షరం ఎం అనే ఆకారంలో టాటు ఉందని తెలిపారు. యువతికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు స్థానిక పోలీసులకు తెలుపాలన్నారు. గ్రామ కార్యదర్శి పెంటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. సంఘటన స్థలాన్ని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ సందర్శించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దుగ్గొండి, ఫిబ్రవరి10: అనారోగ్యంతో పాటు కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తిమ్మంపేటలో శనివారం జరిగింది. ఎస్సై పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం తిమ్మంపేట గ్రామానికి చెందిన అల్లేపు బుచ్చయ్య(59)కు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తనకున్న రెండు ఎకరాల భూమితో పాటు ఇంక కొంత భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇదే క్రమంలో బుచ్చయ్య కొంత కాలంగా కాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. పంటల దిగుబడి సరిగా రాకపోవడం, పెట్టిన పెట్టుబడులు రాక అప్పులు కావడంతో మనస్థాపం చెందిన బుచ్చయ్య ఈనెల 9న ఇంటిలో పురుగుల మందుతాగాడు. చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుమారుడు మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

రాయపర్తి ఇన్‌చార్జి ఎస్ఐగా లింగారెడ్డి

రాయపర్తి, ఫిబ్రవరి 10 : రాయపర్తి ఇన్‌చార్జి ఎస్ఐగా లింగారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి సొసైటీ చైర్మన్ బహిష్కరణ

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 10 : నర్సంపేట పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ మురాల మోహన్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్ని రోజులుగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు మోహన్‌రెడ్డిని పార్టీని నుంచి బహిష్కరించినట్లు ఆయన పేర్కొన్నారు.

రగ్బీ క్రీడలో జాతీయ స్థాయికి ఎంపికైన కీర్తన

దుగ్గొండి, ఫిబ్రవరి10: మండలంలోని మల్లంపల్లి కస్తూర్బా విద్యాలయంలో 8వ తరగతి చదువుచున్న వి. కీర్తన రగ్బీ క్రీడలో జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈనెల 3, 4 తేదీలలో యాదాద్రి జిల్లాలో రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడల్లో కీర్తన పాల్గొని ప్రతిభచూపి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు కస్తూర్బా విద్యాలయం ప్రత్యేక అధికారి, పి.మంజుల, పీఈటీ లావణ్యలు శనివారం తెలిపారు. ఈనెల 13, 14 తేదీలలో గుజరాత్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో కీర్తన పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రమ, సుభాషిణీ, పుష్పలీల, సరస్వతి, స్రవంతి, సంధ్య, రాధిక, రమ్య, కవిత, అభినందించారు.

రెజ్లింగ్‌లో ఎంపికైన విద్యార్థి

దుగ్గొండి, ఫిబ్రవరి10: మండల కేంద్రంలోని ఆదర్శవాణి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి భరత్ రెజ్లింగ్ క్రీడలో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 8, 9 తేదిల్లో హన్మకొండలోని జేఎన్ఎస్ గ్రౌండ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ అండర్ 15 బాలుర విభాగం క్రీడలలో భరత్ పాల్గొని ప్రతిభచాటి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు కోచ్ దేవేందర్ శనివారం తెలిపారు. ఈనెల 29 నుంచి మార్చి 5 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ క్రీడల్లో భరత్ పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, శశిధరచారి, డైరెక్టర్ బుచ్చన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

సైన్స్ ఫెయిర్‌లో బహుమతిని సాధించిన భార్గవి

చెన్నారావుపేట, ఫిబ్రవరి 10: మండంలోని ఉప్పరపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అనుమాండ్ల భార్గవి సైన్స్ ఫెయిర్‌లో జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించినట్లు హెచ్ఎం జయ శనివారం తెలిపారు. పాఠశాలలో గైడ్ టీచర్ పిన్నింటి బాలాజీరావు సహకారంతో తయారు చేయబడిన ఇన్నోవేషన్ మల్టీపర్పస్ అడ్జస్టబుల్ టేబుల్ అనే అంశం జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతిని పొందినట్లు తెలిపారు. ఈనెల 12న వరంగల్‌లోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి, సైన్స్ అధికారి కాట్ల శ్రీనువాస్ చేతుల మీదుగా ప్రశంసాపత్రంతో పాటు బహుమతిని అందుకోన్నుట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థినితో పాటు గైడ్ టీచర్‌ను అభినందించారు.

వికాస తరంగిణి ఆధ్వర్యంలో నగర సంకీర్తన

నర్సంపేట, ఫిబ్రవరి 10: వికాసతరంగిణి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నగరసంకీర్తకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీరామునుజు చిత్రపటం కళశాలతో నగర సంకీర్తకార్యక్రమాన్ని నిర్వహించి బియ్యపు గింజలను సేకరించారు. ఈ సందర్భంగా బియ్యగింజల సేకరణ కార్యక్రమాన్ని పట్టణంలోని వెంకటేశ్వరాలయం వద్ద అర్చకులు రామాచార్యులు, శ్రీకర్, శ్రీవిద్య ప్రారంభించారు. వికాసతరంగిణి బాధ్యులు ఎంవి.కృష్ణారావు, దాస్యం రంగనాథస్వామి, యతిపతిశ్రీధర్, చల్లా వెంకటరెడ్డి, వేంశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బియ్యం సేకరించారు. నర్సంపేటలోని వెంకటేశ్వరాలయం, రామాలయం, శివాంజనేయస్వామిఆలయం, ద్వారకపేటలోని వేణుగోపాలస్వామిఆలయం, అశోక్‌నగర్‌లోని రామాలయంలో ఏర్పాటు చేసిన కళశాలలో భక్తులు బియ్యం గింజలను వేయాలని వారు సూచించారు. నగర సంకీర్తన, సమతదీక్ష కార్యక్రమాలు ఈనెల 28 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.

పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం

నల్లబెల్లి, ఫిబ్రవరి 10: మండలంలోని నారక్కపేట ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం, సన్మానోత్సవ కార్యక్రమం స్వర్ణ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌రావు మాట్లాడుతూ.. ఈ సమ్మేళనంలో రెండు దశాబ్దాల చెందిన 2002 నుంచి 2023 వరకు 10వ తరగతిని పూర్తి చేసిన విద్యార్థులు, ఇదే కాలంలో పాఠశాలలో పనిచేసి బదిలీ, ప్రమోషన్, పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులను కూడా ఒకే వేదిక మీదికి తీసుకువచ్చి సన్మానించామన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆత్మీయంగా పలకరించుకొని ఆలింగనం చేసుకున్నారు. నాటి మధురమైన తీపి గుర్తులను నెమురవేసుకుంటూ సంతోషాన్ని వ్యక్త పరుచుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంఈవో సత్యనారాయణ, ఎంఎన్‌వో శ్రీనివాసరావు, గ్రామ నాయకులు వక్కల చంద్రమౌళి, రాయసాబ్, పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అధ్యయనం చేయాలి

నెక్కొండ, ఫిబ్రవరి 10 : భారతదేశంలోని ప్రాథమిక పాఠశాలల నుంచి యూనివర్సిటీ స్థాయి వరకూ విద్యాసంస్థల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాగం ప్రవేశపెట్టాలని దళిత ప్రజాసంఘాల నాయకులు కోరారు. శనివారం నెక్కొండలోని అంబేద్కర్ భవనంలో భారతరాజ్యాంగం ముఖ్యాంశాలు అనే పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతరాజ్యాంగానికి దిక్సూచిగా ఉన్న ఈ పుస్తకంలోని పలు అంశాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు అన్ని వర్గాల ప్రజలు ఈ పుస్తకాన్ని అధ్యయనం చేయవలసిన అవసరం ఉందంటూ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ఒక జిల్లాకు అంబేద్కర్ జిల్లాగా నామకరణం చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ ఈదునూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పాకాలలో పక్షి ఫొటో గ్రాఫర్ల సందడి



పాకాలను సందర్శించిన పక్షి ఫొటో గ్రాఫర్లు

ఖానాపురం, ఫిబ్రవరి 10: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పాకాలలో శనివారం పక్షి ఫొటోగ్రాఫర్లు సందడి చేశారు. హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు చెందిన పక్షి ఫొటో గ్రాఫర్లు, వైల్డ్‌లైఫ్ ఫొటో గ్రాఫర్లు పాకాలలో రెండు రోజుల పాటు నిర్వహించే బర్డ్ వాక్ కార్యక్రమానికి హాజరయ్యారు. శని, ఆదివారాల్లో పాకాల సరస్సు, అభయారణ్యంలో విహరించే అరుదైన పక్షులపై అధ్యాయనం చేయడానికి వారు పాకాలకు వచ్చినట్లు డీఆర్వో నాగరాజు తెలిపారు. పాకాలలో గుర్తించిన పక్షుల వివరాలను, వారు చేపట్టిన సర్వేపై పక్షి ఫొటో గ్రాఫర్లు నేడు(ఆదివారం) వివరాలు వెల్లడించనున్నట్లు డీఆర్వో తెలిపారు. కార్యక్రమంలో పక్షి ఫొటో గ్రాఫర్లు శ్రీరాం రెడ్డి, క్రిష్ణ, రవి, కళ్యాణ్, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఐగా బాధ్యతలు చేపట్టిన సూర్యప్రకాశ్



వర్ధన్నపేట, ఫిబ్రవరి 10: వర్ధన్నపేట సీఐగా జి. సూర్యప్రకాశ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన సీఐ శ్రీనివాస్‌ను ఐజీకి అటాచ్ చేయగా, ఆయన స్థానంలో సూర్యప్రకాశ్‌ను నియమించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ శాంతిభద్రత విషయంలో రాజీలేకుండా పని చేస్తానని తెలిపారు. అసాంఘిక కార్యాకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. బాధ్యతలు చేపట్టిన సీఐని వర్ధన్నపేట, జఫర్‌గడ్ ఎస్ఐలు ప్రవీణ్ కుమార్, మహేందర్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సీఐగా బాధ్యతలు చేపట్టిన సూర్యప్రకాశ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య ఆధ్వర్యంలో నాయకులు శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు మల్లె పాక సమ్మ య్య, టౌన్ అధ్యక్షుడు చేరుపెల్లి ఆబు, తదితరులు పాల్గొన్నారు.

● రాయపర్తి: వర్ధన్నపేట సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సూర్య ప్రకాష్ శనివారం రాయపర్తి పో లీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్ఐ లింగారెడ్డి, సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

నేడు 5వ తరగతి ప్రవేశ పరీక్షలు

పర్వతగిరి, ఫిబ్రవరి 10: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు కామన్ ఎంట్రన్స్ టెస్టు ఆదివారం నిర్వహించనున్నట్లు గురుకుల జిల్లా సమన్వయకర్త, పర్వతగిరి సోషల్ వెల్ఫేర్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.సమ్మయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులు ఒక గంట ముందుగా హాజరుకావాలని సూచించారు. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోని వారు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు.

కొంచెం చేదు.. కొంచెం తీపి..

(5వ పేజీ తరువాయి)

అవుతుంది. రాంపూర్‌లో ఉన్న ఐటీ పార్క్‌లో యూనిట్ల స్థాపనకు మరిన్ని ఐటీ కంపెనీలు ముందుకు వచ్చే అవకాశం ఉంది. గత ప్రభుత్వం తగిన చొరవ తీసుకోకపోవడం వల్ల ఈ ఐటీ పార్క్‌లో నాలుగు కంపెనీలు మాత్రమే తమ ఐటీ యూనిట్లను ఏర్పాటు చేసాయి.

పంచాయతీలకు నిధులు

పంచాయతీరాజ్ శాఖకు బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. ఆరు గ్యారంటీల తర్వాత ఎక్కువ మొత్తంలో ఈశాఖకే నిధులు కేటాయించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి బడ్జెట్‌లో రూ.40,080 కోట్లను ప్రతిపాదించారు. ఉమ్మడి జిల్లాలో 1,680 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల పంచాయతీలు నిధులు లేక నీరసించాయి. పల్లెల అభివృద్ధికి పలు కార్యక్రమాలను చేపట్టినా ఆమేరకు నిధులు ఇవ్వకపోవడంతో అధికారులు, ముఖ్యంగా సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సు ప్రకారం పంచాయతీలకు నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు గత ప్రభుత్వ హయాంలోకన్నా ఎక్కువ నిధులు అందే అవకాశం ఉంది.

నగరాభివృద్ధి

రాష్ట్రంలోని అన్ని పురప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి భట్టి వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు పట్టణ ప్రాంత అభివృద్ధికి నిధులను విడుదల చేస్తామని ప్రకటించారు. బడ్జెట్‌లో పురపాలక శాఖకు రూ.11,692 కోట్లు కేటాయించారు. గత ప్రభుత్వ బడ్జెట్‌లో కన్నా రూ.400 కోట్లు ఎక్కువ. బడ్జెట్‌లో వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్‌రింగ్ రోడ్డు పనుల పూర్తికి ప్రత్యేకంగా నిధుల కేటాయింపు ప్రతిపాదనలేమీ కనిపించలేదు.

రూ.2లక్షల రుణమాఫీ

రూ.2లక్షల రుణ మాఫీపై త్వరలోనే కార్యాచరణ ఉంటుందని, అందుకు విధివిధానాలను రూపొందిస్తున్నామని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇది అమలులోకి వస్తే ఉమ్మడి జిల్లాలో లక్షా 50వేల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. గత ప్రభుత్వం రూ.లక్ష వరకే రుణమాఫీ చేసింది. ఇది కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదు. రూ.2లక్షల వరకు రుణాల ప్రకటనతో రైతుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది.

రైతు బంధు

రైతు బంధు నిబంధనలను పునఃసమీక్షించి నిజమైన అర్హులకు రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలు అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్న ప్రకటనతో కూడా అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో 7.40 లక్షల మంది రైతులు లబ్ధి పొందుతారు. గత ప్రభుత్వం రైతు బంధు పథకం కింద రెండు విడతలుగా ఎకరానికి రూ.10వేలు అందచేసింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే రైతు బంధు కింద ఎకరానికి రూ.15వేలు ఇస్తామని వాగ్దానం చేసింది తెలిసిందే. అన్నట్టే బడ్జెట్‌లో ఈ మేరకు ప్రతిపాదన చేసింది. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ. 19,746 కోట్లను ప్రతిపాదించింది.